సెల్ఫీ విత్ గణేశ్



చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో వినాయక విగ్రహానికి డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ. ఫొటో పంపినవారు : ఆలయ పురోహితుడు నున్న కృష్ణమాచార్యులు

పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ

- రూ. 6.05 కోట్ల నిధులతో పనులకు శ్రీకారం
- తీరనున్న వాహనదారుల, ప్రయాణికుల ఇబ్బందులు

శాలిగౌరారం : మండలంలోని రెండు ప్రధాన పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఎంతోకాలంగా అధ్వానస్థితిలో ఉన్న మాధారంకలాన్-ఇటుకులపహాడ్, గురుజాల-చిత్తలూరు రోడ్లు ఎట్టకేలకు అభివృద్ధి చెందనున్నాయి. దీంతో శాలిగౌరారం మండలంలోని ఇటుకులపహాడ్, వంగమర్తి, చిత్తలూరు, తుడిమిడి గ్రామాల ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి. స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్ కృషితో ప్రభుత్వం రూ. 6.05 కోట్ల నిధులను మంజూరు చేసింది. రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించిన అన్ని రకాల అనుమతులు కూడా రావడంతో మరికొద్ది రోజుల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తిచేసి పనులను ప్రారంభించేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు



నూతన బీటీ రోడ్డుగా అభివృద్ధి చెందనున్న మాధారంకలాన్-ఇటుకులపహాడ్ రోడ్డు



అభివృద్ధి చెందనున్న గురుజాల-చిత్తలూరు రోడ్డు

రూ. 6.05 కోట్ల వ్యయంతో..

శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్-ఇటుకులపహాడ్, గురుజాల-చిత్తలూరు పంచాయతీరాజ్ రోడ్లను రూ. 6.05 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. వాటిలో మాధారంకలాన్-ఇటుకులపహాడ్ వరకు 3.7 కిలోమీటర్ల పొడవు ఉన్న రోడ్డును సీఆర్ఆర్(కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్డు) నిధుల నుంచి రూ. 3.50 కోట్లతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. గురుజాల-చిత్తలూరు వరకు 8 కిలోమీటర్ల పొడవు ఉన్న రోడ్డును ఎంఆర్ఆర్(మెయింటెనెన్స్ రూరల్ రోడ్డు) నిధుల నుంచి రూ. 2.55 కోట్ల వ్యయంతో బీటీ రెన్యూవల్‌గా అభివృద్ధి చేయనున్నారు. రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు వచ్చాయి. దీంతో అధికారులు ఆన్‌లైన్ పద్ధతిలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే అగ్రిమెంట్ చేసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ప్రయాణ కష్టాలు తొలగనున్నాయి



మండలంలోని ఇటుకులపహాడ్ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు నిత్యం అనేక అవస్థలు పడుతున్నారు. రోడ్డును అభివృద్ధి చేయనుండడంతో ప్రజలకు, వాహనదారులకు ప్రయాణ కష్టాలు తొలగిపోనున్నాయి.

–ఇంద్రకంటి శ్రీనివాసులు, ఇటుకులపహాడ్, శాలిగౌరారం మండలం

టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం



మండలంలోని మాధారంకలాన్-ఇటుకులపహాడ్, గురుజాల-చిత్తలూరు పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ. 6.05 కోట్లు మంజూరయ్యాయి. పనులకు సంబంధించిన అన్నిరకాల అనుమతులు ప్రభుత్వం నుంచి వచ్చాయి. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే అగ్రిమెంట్ చేసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

–సంపత్, పంచాయతీరాజ్ స్పెషల్ ఏఈ, శాలిగౌరారం మండలం

కేసీఆర్ మరోసారి సీఎం అయితేనే అభివృద్ధి



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : కేసీఆర్ మరోసారి సీఎం అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. పిట్టంపల్లి, ముశంపల్లి గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కౌన్సిలర్లు మారగోని గణేశ్‌గౌడ్, జేరిపోతుల అశ్వినిభాస్కర్‌గౌడ్‌లతో కలిసి బుధవారం ఎమ్మెల్యే కంచర్ల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు, జాతీయ, రాష్ట్ర రహదారులను కలిపే ప్రధాన, లింక్ రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ముశంపల్లి రోడ్డు డబుల్ రోడ్డుగా, పిట్టంపల్లి రోడ్డు రెన్యూవల్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. సీఎం కేసీఆర్ దత్తత తీసుకుంటా అని ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. జిల్లా కేంద్రంలో రూ.1300 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రెండో పైప్‌లైన్ ద్వారా రోజు తప్పి రోజు తాగునీరు, మెడికల్ కాలేజీ, ఐటీ హబ్, ఎన్‌జీ కాలేజీ నూతన భవనం, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడం కోసం మరోసారి తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొర్ర సుధాకర్, దత్త గణేశ్, అభిమన్యు శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, మధుసూదన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకట్ రెడ్డి, బకరం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

నల్లగొండ టూటౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నపూర్ణ క్యాంటిన్ కోసం పాత భవనాన్ని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రికి రోగులతోపాటు వచ్చే వారి సహాయకులకు, బంధువులకు తక్కువ ధరకే భోజన వసతి కల్పించడానికి అన్నపూర్ణ క్యాంటిన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నిర్ణయించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కమిషనర్ కె.వి. రమణాచారి, ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చునాయక్, లయన్ గోలి అమరేందర్‌రెడ్డి, తీగల మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ కోతలు నివారించాలని ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

కేతేపల్లి : విద్యుత్ కోతలను నివారించి, వ్యవసాయ రంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో రోజుకు కనీసం మూడు గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. దీంతో సాగు చేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు జటంగి సాడయ్య, ఏర్పుల గంగయ్య, జటంగి వెంకన్న, చెన్నయ్య, వీరయ్య, రజాక్ అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యేల పర్యటన

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం, పర్వతగిరి, కనగల్, బుడుమర్లపల్లి, జి యడవల్లి, కురంపల్లి గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గణనాథుల వద్ద పూజలు చేసిన అనంతరం గ్రామాల్లో అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

మునుగోడు : మండలంలోని పలివెల, జక్కలవారిగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు గురువారం ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి రానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

జిల్లా సహాయ కార్యదర్శిగా లక్ష్మీకాంత్



చండూరు(గట్టుప్పల్) : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సహాయ కార్యదర్శిగా లక్ష్మీకాంత్ నియమితులయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గార్లపాటి కృష్ణారెడ్డి, మధుసూదన్ బుధవారం లక్ష్మీకాంత్‌కు జిల్లా కేంద్రంలో నియామక పత్రం అందజేశారు.

రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మల్లికార్జునరావు

కేతేపల్లి : పెరికల రాజకీయ ఐక్యత, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జునరావు నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య బుధవారం మల్లికార్జునరావుకు నియామక పత్రం అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

మునుగోడు : ఈ నెల 25న చండూరులో నిర్వహించనున్న మహనీయుల పొలిటికల్ ఫ్రంట్ రౌండ్‌టేబుల్ సమావేశం పోస్టర్‌ను బుధవారం మునుగోడులో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహనీయుల పొలిటికల్ ఫ్రంట్ నియోజకవర్గ చైర్మన్ మాలిగ యాదయ్య, జిల్లా వెంకటేష్, నెల్లికంటి రాఘవేంద్ర, మాదగోని నరేందర్‌గౌడ్, పగిళ్ల సత్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'రంగు తువ్వాల' పాట విడుదల

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన భీష్మాచారి రచించి, పాడి, నటించిన రంగు తువ్వాల వీడియో పాటను బుధవారం చిట్యాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విభిన్న రంగాల కళాకారులు వెలుగులోకి రావడం అభినందనీయమన్నారు. మేడి హరికృష్ణ, నర్రా భిక్షంరెడ్డి పాల్గొన్నారు.

నాంపల్లిని రెవెన్యూ డివిజన్ చేయాలని వినతి

నల్లగొండ టూటౌన్ : నాంపల్లి మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ఆర్.వి కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. నాంపల్లిని చండూరు రెవెన్యూ డివిజన్‌లో కలపొద్దని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంబేద్కర్ యువ కేంద్రం జాతీయ అధ్యక్షుడు గురుపాదం, సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, సర్పంచ్ అంగిరేకుల పాండు, పెద్దిరెడ్డి అనంతరెడ్డి, అస్రబిబేగం, చాంద్‌పాషా, కోరే సాయిరాం, వేలాద్రి, శైలజ, కొండయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కట్టంగూర్ : కట్టంగూర్ మండల కేంద్రంలోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన రామస్వామి బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో కట్టంగూర్‌లో జాతీయ రహదారి గుండా వెళుతూ నల్లగొండ వైపు మళ్లాడు. అదే సమయంలో నల్లగొండ నుంచి కట్టంగూర్ వైపు వస్తున్న కారు డ్రైవర్ అతివేగంగా రాంగ్‌రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రామస్వామిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నాం

నల్లగొండ టూటౌన్ : చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో పెట్టిన బిల్లును బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తోందని బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు మాలె శరణ్యారెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని వీటీకాలనీలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత చేసిన పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించిందన్నారు. ఈ సమావేశంలో సింగం లక్ష్మి, దుబ్బ రూప, మామిడి పద్మ తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో పెట్టడాన్ని బీసీ సంక్షేమ సంఘం స్వాగతిస్తోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళా డిగ్రీ కళాశాల నుంచి పెద్ద గడియారం సెంటర్ పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ కోటా తేల్చకుండా బిల్లు పెట్టడంపై రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నిరసన తెలియజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మునాస ప్రసన్న కుమార్, మామిడి పద్మ, సింగం లక్ష్మి, కర్నాటి యాదగిరి, సతీష్‌కుమార్, సతీష్‌యాదవ్, శ్రీనివాస్, రవీంద్రచారి పాల్గొన్నారు.

బహుజన మహిళలకు వాటా ఉండాలి

చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తున్నందున బహుజన మహిళలకు వాటా ఉండాలని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. పర్వతాలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లోనే రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

మహిళా బిల్లును బీసీలంతా వ్యతిరేకించాలి

చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును బీసీలంతా వ్యతిరేకించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ జనగణన చేపట్టి అన్ని రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

ఎంపీ కోమటిరెడ్డి ఆర్థికసాయం

నల్లగొండ : పట్టణంలోని 3వ వార్డు పాతపల్లేకు చెందిన బరిసెట్టి సుగుణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని బుధవారం నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి పరామర్శించి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిన రూ. 10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, బరిసెట్టి మల్లయ్య, బలిజ మల్లయ్య, జేరిపోతుల ఆంజనేయులు గౌడ్, గాలి వెంకటయ్య, శ్రీకాంత్, యనమల్ల అనిల్ తదితరులు ఉన్నారు.

కనగల్ : మండల పరిధిలోని శేరి లింగోటం గ్రామానికి చెందిన మారుపాక వెంకటమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబానికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిన రూ.20 వేల సహాయన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ భిక్షం యాదవ్, కాంగ్రెస్ నాయకులు దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, బోగరి రాంబాబు, కూసుకుంట్ల రాజారెడ్డి, పోషమళ్ల లింగయ్య ఉన్నారు.

రాజగోపాల్ రెడ్డి చేయూత

మునుగోడు : రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునుగోడు మండలంలోని గుండ్లోరిగూడెం గ్రామానికి చెందిన కట్టెకుంట్ల సైదులు వైద్య ఖర్చుల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పంపిన రూ.లక్ష నగదును బుధవారం స్థానిక బీజేపీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన గునగోని మల్లయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ.60వేల సీఎం సహాయ నిధి చెక్కును హైదరాబాద్‌లో బుధవారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిట్యాల యాదగిరిరెడ్డి, ముడిగ నరిసింహ, చిట్యాల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించాలని సబ్‌స్టేషన్ ముట్టడి



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కనగల్ : మండల పరిధిలోని బోయినపల్లి గ్రామానికి చెందిన భిక్షాల శ్రీను జూలై 1న విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మృతిచెందాడు. కాగా శ్రీను కుటుంబ సభ్యులు ఆందోళన చేయడంతో రూ.14 లక్షలు అందజేస్తామని లిఖిత పూర్వకంగా విద్యుత్ అధికారులు హామీ ఇచ్చారు. ఆగస్టు నెలలో పరిహారం చెల్లించాల్సి ఉన్నా నేటికీ పరిహారం అందజేయకపోవడంతో బుధవారం శ్రీను బంధువులు, గ్రామస్తులు సబ్‌స్టేషన్ ముట్టడించారు. మహిళలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ముట్టుకునేందుకు వెళ్లగా సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాను 3గంటల పాటు నిలిపివేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్ఐ అంతిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులను శాంతిపజేశారు. సోమవారం నాటికి రూ.10 లక్షలు అందజేసి మిగతా డబ్బులు అక్టోబర్ 20 వరకు అందజేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు అక్కడినుంచి వెళ్లిపోయారు.

దోమల నివారణపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : కాలనీల్లో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కె.వి. రమణాచారి అన్నారు. బుధవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, మలేరియా సిబ్బంది, మెప్మా సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ చేరిన ప్రదేశంలో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. 48 వార్డుల పరిధిలోని అన్ని కాలనీల్లో ఎక్కడ నీరు నిలుస్తుందో గుర్తించాలన్నారు. మురుగు నీరు నిలిచిన ప్రదేశంలో దోమల మందు పిచికారీ చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మలేరియా ఎండమాలజిస్ట్ గంగప్ప, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ రణీల

శాలిగౌరారం : ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జెడ్పీటీసీ ఎర్ర రణీల అన్నారు. మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఆత్మీయ అభినందన సమావేశం బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ విద్యాధికారి మేకల నాగయ్య, మండలంలోని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుతో పేదల జీవితాల్లో మార్పు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ నేత దైద రవీందర్ అన్నారు. నకిరేకల్‌లోని 17వ వార్డులో బుధవారం ఆయన ఇంటింటికీ పర్యటిస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయబోయే ఆరు గ్యారెంటీ స్కీంల కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, రూ.2లక్షల రైతు రుణమాఫీ తదితర పథకాలతో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి రవీందర్‌రెడ్డి, యుసఫ్, చనగాని రాజశేఖర్‌గౌడ్, వంటెపాక నక్షత్, నర్సింగ్ మహేష్, నాగరాజు, శ్రవణ్, ప్రసాద్, వెంకటేష్, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

● వినాయక చవితి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా బుధవారం వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. మండపాల్లో ఏర్పాటుచేసిన గణనాథుడి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



నల్లగొండ : పూజలో పాల్గొన్న గుమ్ముల మోహన్‌రెడ్డి దంపతులు, తదితరులు



నల్లగొండ పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో పూజలో పాల్గొన్న మహిళలు



విద్యానగర్ పార్కులో పూజలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్

కొనసాగుతున్న రిలే దీక్షలు

మునుగోడు : మునుగోడును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేయడంతో పాటు 30 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మునుగోడులోని అంబేద్కర్ చౌరస్తాలో స్థానిక నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం కొనసాగింది. దీక్షలో భారతీయ ప్రజా పార్టీ జాతీయ అధ్యక్షుడు మాదగోని వెంకటేశ్వర్లు గౌడ్ పాల్గొని మాట్లాడుతూ 10 రోజులుగా దీక్ష చేపడుతున్నా ఇప్పటివరకు ఏ ఒక్క ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదగోని నరేందర్‌గౌడ్, మాలిగ యాదయ్య, నెల్లికంటి రాఘవేంద్ర, బొమ్మగోని లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

గణపయ్యకు పూజలు షురూ..



నాలుగు రోజుల క్రితం ఇలా..



నేడు భక్తుల పూజలు అందుకుంటున్న లక్ష్మీ గణపతి

సాక్షి ఎఫెక్ట్..

నకిరేకల్ : పట్టణంలోని శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల సమీపంలో కంప చెట్ల మధ్యలో ఏళ్లుగా పడి ఉన్న పురాతన శ్రీలక్ష్మీగణపయ్యకు మోక్షం లభించింది. ఈ నెల 17న సాక్షి దినపత్రికలో అయ్యో.. గణపయ్యా అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన పట్టణ భక్తులు ఈ ప్రాంతాన్ని సందర్శించి చెట్ల మధ్యలో ఉన్న గణపతి విగ్రహం చుట్టూ కంప చెట్లను తొలగించి విగ్రహం పైనే చలువ పందిళ్లతో మండపాన్ని నిర్మించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో భక్తులు గణపయ్యను సందర్శించి పూజలు చేయడం ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి ఇక్కడ ఆలయాన్ని నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

25న ట్రాన్స్‌కో కార్యాలయాల ఎదుట ధర్నా

నల్లగొండ టూటౌన్ : నిరుపేద దళితులకు జీఓ నంబర్ 342 ప్రకారం 100 యూనిట్ల ఉచిత విద్యుత్ గృహ అవసరాలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న జిల్లావ్యాప్తంగా ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయాల ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున కోరారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలను బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలోని పెద్దబండలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు గారె నరసింహ, కోట సైదులు, రత్నం యాదయ్య, దాసరి ఆనంద్, గిరి, చింత ఎల్లయ్య, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి

చండూరు : అమరుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు అన్నారు. కస్తాల గ్రామంలో గంట పెద్ద రాములు జ్ఞాపకార్థం నిర్మించిన స్తూపాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలప రాజు రామలింగయ్య, మండల కార్యదర్శి సతీష్‌కుమార్, పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, బరిగెల వెంకటేశ్, వెంకన్న, శంకరయ్య పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

చిట్యాల : గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేపూరి రవీందర్ అన్నారు. చిట్యాల పట్టణానికి చెందిన చికిలంమెట్ల అశోక్ ఇటీవల బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియామకం కావడంతో బుధవారం అశోక్‌ను చిట్యాలలో ఘనంగా సన్మానించి మాట్లాడారు. కన్నెబోయిన మహాలింగం యాదవ్, మాస శ్రీనివాస్, పల్లె వెంకన్నగౌడ్, జయారపు రామకృష్ణ, గంజి గోవర్ధన్, నరేష్‌గౌడ్, పాపని వాసుదేవ్, గోశిక వెంకటేశం పాల్గొన్నారు.

కనగల్‌లో భారీ వర్షం

కనగల్ : మండల వ్యాప్తంగా బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కోతకు వచ్చిన వరి చేలు నేలకొరిగాయి. పత్తిసాగు చేసిన రైతులు మాత్రం ఊపిరి పీల్చుకున్నారు. జి యడవల్లిలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.



జి యడవల్లిలో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

22న 'చలో హైదరాబాద్'

చిట్యాల : కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్‌ను కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న చిట్యాలలో బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, బొల్లు రవీందర్‌కుమార్, మామిడి హనుమంతు, గుణగంటి కృష్ణ, అంజయ్య, శంకర్, నర్సింహ, కాటమయ్య, వెంకన్న, పరమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మర్రిగూడ : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య గురువారం తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు, ఆరోగ్య బీమా రూ.10లక్షలు అందించాలని, స్కూటీలు అందించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళ్తామని అన్నారు. ఆశా వర్కర్లు మట్టం భాగ్యమ్మ, వసంత, ఏర్పుల పద్మ, కాలం సుజాత, సైదాబేగం, లపంగి దుర్గమ్మ, అయిలి కలమ్మ, రోజా, విజయ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

చండూరు : గట్టుప్పల్ సెక్టార్ పరిధిలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివేషా బుధవారం పౌష్టికాహారం అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు సమ్మె చేస్తుండడంతో ఏఎన్ఎం, ఆశా వర్కర్ల సహాయంతో సూపర్‌వైజర్లే స్వయంగా పౌష్టికాహారం పంపిణీ చేశారు.

పనుల పరిశీలన

కనగల్ : మండల పరిధిలోని తేలకంటిగూడెం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ నిర్మాణ పనులను ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట పీఆర్ఏఈ శ్రీనివాస్, సర్పంచ్ బోగరి రాంబాబు, సెక్రటరీ తేజ తదితరులు ఉన్నారు.

సబ్సిడీ గొర్రెల పట్టివేత

నల్లగొండ క్రైం : ప్రభుత్వం సబ్సిడీపై అందించిన గొర్రెలను తిరిగి మాచర్లకు తరలిస్తుండగా బుధవారం మర్రిగూడ బైపాస్ వద్ద నల్లగొండ రూరల్ పోలీసులు పట్టుకుని పలువురిపై కేసు నమోదు చేశారు. చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో ప్రభుత్వం యాదవులకు ఇచ్చిన గొర్రెలను తక్కువ ధరకు కొనుగోలు చేశారు. తిరిగి ఆ గొర్రెలను సబ్సిడీపై యాదవ్‌లకు ఇచ్చేందుకు మాచర్లకు చెందిన సీతా యేసుబాబు, బద్దెల వెంకటెశ్వర్లు, ఎండి షబ్బీర్‌లు డీసీఎంలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కంచర్ల భాస్కర్ రెడ్డి తెలిపారు.